క్లుప్తంగా

22,23 తేదీల్లో మంత్రి పెద్దిరెడ్డి పర్యటన

కుప్పం: ఈనెల 22, 23 తేదీల్లో కుప్పం నియోజకవర్గంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటించ నున్నారని ఎమ్మెల్సీ భరత్ ఓ ప్రకటనలో తెలిపారు. గుడుపల్లె మండలంలోని 18 పంచాయతీల్లో రెండు రోజులు పాటు జరిగే సభలు, సమావేశాల్లో మంత్రి పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీశ్రేణులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వేదోక్తంగా త్రిశూల ప్రతిష్ట


ఆలయంలో ప్రతిష్ఠించిన త్రిశూలం

రొంపిచెర్ల: రొంపిచెర్ల ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం త్రిశూల ప్రతిష్ట అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయం దాతల సాయంతో అభివృద్ధి చెందుతుంది. కొందరు దాతలు త్రిశూలం ప్రతిష్టకు విరాళాలను అందజేశారు. వేదపండితులు గుణశేఖర్ ఆధ్వర్యంలో ఆలయంలో వేదమంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా త్రిశూలాన్ని ప్రతిష్ఠించారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని, త్రిశూలం వద్ద కొబ్బరికాయలు కొట్టి, హారతులు సమర్పించారు. అర్చకులు ముని రాజశర్మ తీర్థ ప్రసాదాలు అందించారు.

నేటి నుంచి గడప గడపకు..

గంగవరం: మండలంలో సోమ, మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ పాల్గొంటారని ఎంపీడీవో తాజ్‌మస్రూర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి ఆదివారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. సోమవారం పత్తికొండ సచివాలయ పరిధిలోని గోవిందశెట్టిపల్లె, అటుకుర్లాళ్లపల్లె, పెద్దినేపల్లె, బెస్తగానిపల్లెలో ఎమ్మెల్యే పర్యటిస్తారని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. అధికారులతో కలసి ఇంటింటికీ వెళ్లి సమస్యలు, పథకాల లబ్ధిని తెలుసుకుంటారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

బంగారుపాళెం: మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలని ఆదివారం టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రధాన గేటు వద్ద ఈమేరకు నిరసన వ్యక్తం చేశారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మురళీకృష్ణ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వినాయకుని సేవలో పుదుచ్చేరి సీఎస్


స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఏఈఓ రవీంద్రబాబు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామిని పుదుచ్చేరి చీఫ్ సెక్రటరీ రాజీవ్ వర్మ దర్శించుకున్నారు. ఆదివారం రాత్రి ఆయన కుటుంబ సమేతంగా విచ్చేయగా ఆలయ ఏఈఓ రవీంద్రబాబు స్వాగతం పలికి, ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనం పలుకగా, తీర్థ ప్రసాదాలు, చిత్రపటాన్ని ఏఈఓ అందించారు.

కంటి ఆపరేషన్లకు 30 మంది ఎంపిక



బైరెడ్డిపల్లి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం మహతి ఫౌండేషన్ సహకారంతో కుప్పం పీఈఎస్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 110 మందికి కంటి చికిత్సలు నిర్వహించారు. వీరిలో 30 మందిని ఉచిత ఆపరేషన్ల కోసం ఎంపిక చేశారు. కుప్పం పీఈఎస్ వైద్యాధికారులు, మహతీ ఫౌండేషన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

జ్యూస్ ఫ్యాక్టరీల వద్ద ఇక్కట్లు

గుడిపాల: జ్యూస్ ఫ్యాక్టరీల వద్ద భారీగా వాహనాలు నిలుస్తుండడంతో ఇతర వాహనదారులకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. మండలంలోని చిత్తూరు–వేలూరు రహదారిలో రెండు జ్యూస్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. ఈ ఫ్యాక్టరీలకు మామిడి కాయలను వాహనాల్లో తీసుకొస్తారు. అయితే ఈ వాహనాలన్నీ రోడ్డుపైనే రెండు వైపులా నిలుపుతుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. గత రెండు రోజులుగా కిలోమీటర్ల మేర వాహనాలన్నీ నిలిచిపోయాయి. దీనికితోడు డ్రైవర్లు రోడ్డుపక్కన మద్యం సేవించి తగాదాలు పడుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ముంగిటే సంక్షేమం.. సేవలు


సదుం: తిమ్మానాయనపల్లె సచివాలయం


ఫిర్యాదులు స్వీకరిస్తున్న సిబ్బంది

- సులభతరంగా సమస్యల పరిష్కారం
- సచివాలయాలతో శరవేగంగా సేవలు
- సాకారమైన గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

మండలంలో కుటుంబాల సంఖ్య:	8992
పంచాయతీలు:	18
జనాభా(2011):	34394
మొత్తం సచివాలయాలు:	11
సిబ్బంది సంఖ్య:	88

సదుం: గ్రామీణ ప్రజలకు సచివాలయాల ద్వారా స్థానికంగానే ప్రభుత్వ సేవలు అందుతోంది. 2019, అక్టోబరు 2న సచివాలయాల వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ప్రతి రెండువేల ఇళ్లకు ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేశారు. సంబంధిత శాఖలకు సంబంధించి 11 మంది కార్యదర్శులను నియమించారు. వీరి ద్వారా 536 రకాల సేవలను ప్రజలకు అందిస్తున్నారు. విద్యుత్ బిల్లులు, పలు రకాల ధ్రువీకరణ పత్రాలు, పంచాయతీ సేవలతో పాటు, రాష్ట్ర ప్రభుత్వానికి పలు సర్వీసులను సచివాలయాల ద్వారా స్థానికంగా సులభతరంగా అందుతున్నాయి. ప్రతి యాభై ఇళ్లకు నియమించిన వలంటీర్ల సహకారంతో ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేస్తున్నారు.

ఇళ్ల వద్దకే అందుతున్న సేవలు

సచివాలయ సిబ్బంది వలంటీర్ల సహకారంతో క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల ఎంపిక, ఆన్‌లైన్‌లో వివరాల నమోదు, పథకాలను అందజేసేవరకు బాధ్యతలు తీసుకుంటున్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా ఉంటూ నేరుగా లబ్ధిదారుల ముంగిటకే పథకాలు అందేలా చూస్తున్నారు. అర్హత ఉన్న ఏ ఒక్కరూ నష్టపోకుండా పారదర్శకమైన సేవలు అందిస్తూ మన్ననలు అందుకుంటున్నారు.

స్పందన ద్వారా సమస్యల పరిష్కారం

సచివాలయాల్లో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమం ద్వారా సమస్యల వినతులు స్వీకరిస్తున్నారు. ఫిర్యాదులను ఎప్పటికప్పుడు నమోదు చేసి వాటిని పరిష్కరించేలా చొరవ చూపుతున్నారు. సమస్యల పరిష్కారాన్ని యాప్‌లో నమోదు చేస్తున్నారు. సచివాలయాల పరిధిలో పరిష్కరించలేని వాటిని సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూస్తున్నారు.

అవినీతికి తావేలేదు

గతంలో ప్రభుత్వ పథకాలను పొందాలంటే నాయకులు, దళారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. వారికి తృణమో, ఫణమో అందించాల్సి వచ్చేది. ప్రస్తుతం అలాంటి అవసరమే లేకుండా పోయింది. అర్హత ఉన్నవారిని వలంటీర్లు గుర్తించి, వారిని సచివాలయాల ద్వారా దరఖాస్తు చేయించి పథకాలు అందేలా చూస్తున్నారు. దీంతో సేవలు పారదర్శకంగా అందుతున్నాయి. సచివాలయ సేవలపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

సదుం మండలంలో నాలుగేళ్లలో..

పథకం	లబ్ధిదారులు	అందించిన మొత్తం రూ.కోట్లలో
వైఎస్సార్ చేనేత	2094	11.78
వైఎస్సార్ ఆసరా	6610	24.7
కాపునేస్తం	225	1.02
ఈబీసీ నేస్తం	383	1.72
అమ్మఒడి	2570	10.8
జగనన్న విద్యాదీవెన	1311	6.45
వసతి దీవెన	4196	52.8
వైఎస్సార్ బీమా	36	0.36
వాహన మిత్ర	160	0.64
చేదోడు	134	0.4
హౌసింగ్	1379	24.83
జగనన్న తోడు	467	1.87
ఆరోగ్య ఆసరా	443	0.19
రైతు భరోసా	7414	35.5
ఇన్‌పుట్ సబ్సిడీ	1945	1.06
పంట రుణాలు	1144	0.29
క్రాప్ ఇన్సూరెన్స్	7414	3.94
ఎస్‌హెచ్‌జీ సున్నా వడ్డీ	889	5.1
ఎస్‌హెచ్‌జీ బ్యాంకు లింకేజీ	557	100
స్త్రీ నిధి	145	9.75
మొత్తం	40837	295.58

సమస్య పరిష్కారం



అమ్మ ఒడి మంజూరులో సమస్య తలెత్తింది. దీనిపై సచివాలయంలో ఫిర్యాదు చేశాను. సకాలంలో పరిష్కారాం అయ్యింది. అమ్మఒడి మంజూరు అయ్యింది. సచివాలయ వ్యవస్థ ఎంతో బాగుంది.

–శివయ్య, జోగివారిపల్లె

ఇళ్లు మంజూరు అయ్యింది



గత ప్రభుత్వంలో సొంతింటి కోసం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఈ ప్రభుత్వంలో సచివాలయంలో ఇల్లు కావాలని దరఖాస్తు చేసుకున్న వెంటనే మంజూరు అయ్యింది. సొంతింటి కల తీరనుండడంతో ఆనందంగా ఉంది. ఇందు కోసం ఎవరికీ డబ్బు చెల్లించలేదు.

–సరస్వతమ్మ, చెరుకువారిపల్లె

మెరుగైన సేవలు



సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయి. పారదర్శకంగా సేవలు అందించేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. గ్రామీణులకు సమస్యల పరిష్కారానికి మండల కేంద్రానికి వెళ్లే బాధ తొలిగింది.

–ప్రకాష్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్, సదుం

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


నెర్నెల్లి గ్రామంలో సంక్షేమ బావుటా బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ తెలిపారు. ఆదివారం మండలంలోని బందార్లపల్లె పంచాయతీ నెర్నెల్లి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిపై ఆరా తీశారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, పార్టీలకతీతంగా పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని పేర్కొన్నారు. అర్హత ఉండి పథకాలు అందని వారిని గుర్తించి లబ్ధి చేకూర్చాలని అధికారులకు సూచించారు. సకాలంలో అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే రాష్ట్ర మొదటిస్థానంలో ఉందన్నారు. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరిస్తూ సంక్షేమ బావుటా బుక్‌లెట్‌ను అందించారు. చిన్న చిన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మురుగునీటి కాలువలు,సీసీ రోడ్ల పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్సీ సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, పార్టీ కో–కన్వీనర్ చంద్రారెడ్డి, స్థానిక సర్పంచ్ రాజగోపాల్, ఎంపీటీసీ సభ్యురాలు సౌమ్య, నేతలు రామకృష్ణారెడ్డి, రామలింగారెడ్డి, కేశవరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, బోర్‌వెల్ చెంగారెడ్డి, సుబ్రమణ్యం, మండల అధికారులు పాల్గొన్నారు.

నేడు సింగసముద్రం పంచాయతీలో..

మండలంలోని సింగసముద్రం పంచాయతీ పరిధిలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్సీ భరత్ పాల్గొంటారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబు రెడ్డి తెలిపారు. ఉదయం 7 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

వెల్డింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తాం


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా

పుంగనూరు: వెల్డింగ్ కార్మికుల సమస్యలను అన్ని విధాలుగా పరిష్కరిస్తామని నూతన గౌరవ అధ్యక్షుడు, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు. ఆదివారం పట్టణంలో వెల్డింగ్ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా అలీమ్‌బాషాను ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి దృష్టికి సమస్యలను తీసుకువచ్చి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్మికులకు బీమా సౌకర్యం, ప్రత్యేక గుర్తింపు కార్డులు, హౌసింగ్, జగనన్న కాలనీలలో ఇల్లు మంజూరు చేయించేందుకు కృషి చేస్తామని తెలిపారు. వెల్డింగ్ కార్మికులు బాషు, నజీర్, బావాజాన్, రియాజ్, అమానుల్లా, ఈశ్వర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

నూతన అధ్యక్షుడుగా బాషు

వెల్డింగ్ కార్మికుల సంఘం అధ్యక్షుడిగా కెఎస్.బాషును ఎన్నుకున్నట్లు నూతన గౌరవాధ్యక్షుడు అలీమ్ బాషా తెలిపారు. అలాగే ఉపాధ్యక్షుడుగా నజీర్, కార్యదర్శిగా రియాజ్, ఉపకార్యదర్శిగా రజి, కోశాధికారిగా అమానుల్లా, కమిటీ సభ్యులుగా ఖలీల్, ఇమ్రాన్, షమి, ఈశ్వర్‌రాజు, రియాజ్, నూర్‌ను ఎన్నుకున్నారు.

ఇద్దరికి ఎంపీ మిథున్‌రెడ్డి సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న అలీమ్‌బాషా, షరీఫ్

పుంగనూరు: పట్టణంలోని ఇద్దరు యువకులకు లోక్‌సభ ప్యానల్ స్పీకర్, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి రూ.1.20 లక్షలు ఆర్థిక సహాయం అందించారు. ఆదివారం మున్సిపల్ చైర్మన్ అలీమ్ బాషా, మైనారిటీ సెల్ రాయలసీమ జిల్లాల ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్‌షరీఫ్, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము కలసి ఆర్థిక సహాయం అందజేశారు. పట్టణంలోని పేదలకు ఉచిత కంటి చికిత్సలు నిర్వహిస్తున్న నయాజ్‌కు రూ.50 వేలు, పట్టణంలో కరాటే శిక్షణ ఇస్తున్న మన్సూర్‌ఆలీకి రూ.70 వేలు సాయం అందించాలని స్థానిక నేతలు ఎంపీని కోరారు. స్పందించిన ఎంపీ ఈమేరకు ఆర్థిక సహాయం అందించారు. కౌన్సిలర్ కిజర్‌ఖాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు నూరుల్లా, ఇర్ఫాన్, జవహర్ పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మెరిసిన శశాంక్



పలమనేరు: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో పలమనేరు పట్టణానికి చెందిన బి.శశాంక్ జాతీయ స్థాయిలో ఓబీసీ విభాగంలో రెండో ర్యాంకు సాధించాడు. పట్టణంలోని సాయినగర్‌లో చెందిన సామాజిక సేవకుడు, బిల్డర్ గణేష్‌యాదవ్ కుమారుడు శశాంక్. బెంగళూరులో ప్రాథమిక విద్య, ఆపై ప్రయివేటు కళాశాలలో ఇంటర్ చదివాడు. అన్ని పరీక్షల్లోనూ టాపర్‌గా నిలిచాడు డబ్బుకంటే చదువే ముఖ్యమని తాను కష్టపడి చదివినట్లు విద్యార్థి తెలిపాడు. ఇందుకు తల్లిదండ్రులు ప్రోత్సహించారని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో మెరిసిన ఈ ఆణిముత్యాన్ని విద్యావేత్తలు మెచ్చుకుంటున్నారు.

మోడల్ స్కూల్ ఎంట్రన్స్ ఫలితాల విడుదల


హాసిని, సాహిత్య, అబ్దుల్ ఇర్ఫాన్

రొంపిచెర్ల: రొంపిచెర్ల ఆదర్శ పాఠశాలలో ఆరవ తరగతి ప్రవేశాలకు నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను ప్రిన్సిపల్ సరళ ఆదివారం విడుదల చేశారు. పరీక్షల కోసం 91 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వారిలో 73 మంది మాత్రమే హాజరయ్యారని, మొదటి రౌండ్‌లో 40 మంది విద్యార్థులు మాత్రమే ప్రవేశ పరీక్షలో అర్హత సాధించినట్లు పేర్కొన్నారు. సంతోష్ 74 మార్కులు, వి.హాసిని 72 మార్కులు, అబ్దుల్ ఇర్ఫాన్ 71, జి.సాహిత్య 71 మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారని తెలిపారు. కటాఫ్ మార్కులు తగ్గించి రెండవ రౌండ్‌లో మరి కొందరిని ఎంపిక చేసే అవకాశం ఉందని వెల్లడించారు. అర్హత సాధించిన విద్యార్థులు టీసీ, ఆధార్ కార్డులతో వచ్చి పాఠశాలలో చేరాలని సూచించారు.

కల్కి ఆశ్రమంలో ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ స్పీకర్


శాంతరాం నేతంకు స్వాగతం పలుకుతున్న ఆర్డీఓ

రామకుప్పం: మండలకేంద్రానికి సమీపంలోని కల్కి ఆశ్రమంలో ప్రత్యేక పూజల్లో పాల్గొనేందుకు ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ శాంతరాం నేతం ఆదివారం సత్యలోకం చేరుకున్నారు. కుప్పం ఆర్డీఓ శివయ్య ఆయనకు పుష్పగుచ్ఛం అందించి సాదర స్వాగతం పలికారు. సోమవారం ఉదయం ప్రత్యేక పూజల్లో డిప్యూటీ స్పీకర్ పాల్గొననున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామకుప్పం తహసీల్దార్ మురళీ, ఎస్‌ఐ కృష్ణయ్య పాల్గొన్నారు.

కరుణీకర్ సంఘ నూతన కార్యవర్గం


సుబ్రమణ్యంపిళ్లై

పలమనేరు: పలమనేరు నియోజకవర్గ కరుణీకర్ సంఘం నూతన కార్యవర్గం ఆదివారం ఏకగ్రీవంగా ఎంపికైంది. స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం గౌరవాధ్యక్షుడిగా సీపీ కుమార్, సలహాదారుడిగా సుధాకర్‌పిళ్లై, అధ్యక్షుడిగా సుబ్రమణ్యంపిళ్లై, ఉపాధ్యక్షులుగా విజయకుమార్, చంద్రశేఖర్, హరినాథ్, కిశోర్, హేమాద్రి, కార్యదర్శిగా జైశంకర్, కోశాధికారిగా మురళితోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం


త్రిమూర్తిరెడ్డి (అధ్యక్షుడు)


సురేష్ (కార్యదర్శి)

పుంగనూరు: పుంగనూరు లయన్స్ క్లబ్ నోబుల్ నూతన అధ్యక్షుడిగా త్రిమూర్తిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు క్లబ్ ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ శివ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ క్లబ్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయన్నారు. నూతన అధ్యక్షుడుగా త్రిమూర్తి రెడ్డి, కార్యదర్శిగా అమరావతి సురేష్, కోశాధికారిగా కొత్వాల్ రజిని, ఉపాధ్యక్షులుగా శ్రీధర్, సుధాకర్ రావును ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. శివ మాట్లాడుతూ నూతన కార్యవర్గం లయన్స్‌క్లబ్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి, క్లబ్‌ను ప్రజలకు అందుబాటులోనికి తీసుకెళ్లాలని సూచించారు. నూతన అధ్యక్షుడు త్రిమూర్తిరెడ్డి మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ద్వారా పుంగనూరుకు మంచి పేరు తీసుకొచ్చేలా సేవలు అందిస్తామని తెలిపారు.

మైనారిటీ సెల్ కార్యదర్శిగా సయ్యద్



బైరెడ్డిపల్లి: వైఎస్సార్‌సీపీ మైనారిటీ సెల్ మండల కార్యదర్శిగా తీర్థంకు చెందిన సయ్యద్ ఖలీమ్‌ను నియమితులైనట్లు జెడ్పీటీసీ ఆర్.కేశవులు పేర్కొన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సయ్యద్‌ఖలీమ్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే ఎన్.వెంకటేగౌడ, డీసీసీబీ చైర్‌పర్సన్ మొగసాల రెడ్డెమ్మ, ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, జెడ్పీటీసీ సభ్యుడు కేశవులు, రాజంపేట ఎన్నికల పరిశీలకులు బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దయానందగౌడుకు కృతజ్ఞతలు తెలిపారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన


కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్

కుప్పం: కుప్పం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఎస్పీ అరవింద్ కంటి ఆస్పత్రి, సాయిమాత సేవా ట్రస్టు సంయుక్తంగా నిర్వహించిన ఉచిత ఉంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో 240 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 90 మందిని ఉచిత ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు సాయి మాత సేవా ట్రస్టు వ్యవస్థాపకుడు జగదీష్ బాబు తెలిపారు. తిరుపతి అరవింద్ కంటి ఆస్పత్రిలో సోమవారం వీరికి కంటి ఆపరేషన్లు జరుగుతాయని తెలిపారు. కంటి వైద్యులు అనూష, హర్ష, అరవింద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఏసు ప్రేమ మార్గం అనుసరణీయం


పుంగనూరు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

పుంగనూరు: ఏసు ప్రభువు సూచించిన ప్రేమ మార్గంలో అందరు నడవాలని క్రైస్తవ మత పెద్దలు సూచించారు. పట్టణంలోని చర్చిలో ఆదివారం రెవరెండ్ ఫాదర్ రమేష్ ఆధ్వర్యంలో దివ్యబలిపూజా కార్యక్రమాలు జరిగాయి. డాక్టర్ ఫాదర్ విల్‌సన్, ఇతర మత పెద్దలతో కలసి ప్రార్థనలు నిర్వహించారు. మరియతల్లి, ఏసునాథుని కీర్తనలు ఆలాపించారు. ప్రతి ఒక్కరు ఆత్మను పరిశుద్ధంగా ఉంచుకుని, ప్రతి ఒక్కరిని ప్రేమించాలని సూచించారు. పట్టణ ప్రముఖులు కౌన్సిలర్ అర్షద్‌అలి, ఉదయ్, బాలు, ఆంటోనిరాజ్‌ను సన్మానించారు. మత పెద్దలు జోష్‌అమ్రోత్, ఆసిన్ పాల్గొన్నారు.

రెండవ ఎంఈఓల నియామకం


పోకల తాతయ్య

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల మండల రెండవ ఎంఈఓగా పోకల తాతయ్య నియమితులయ్యారు. ఈమేరకు డీఈఓ విజయేంద్రరావు ఆదేశాలు జారీ చేశారు. సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

పలమనేరులో లీలారాణి, బాలసుందరం



పలమనేరు: పలమనేరు మండల ఎంఈవో–2లుగా లీలారాణి (అడ్మినిస్ట్రేషన్), బాలసుందరం(అకడమిక్ సెక్షన్) నియమితులయ్యారు. జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన కౌన్సెలింగ్‌లో ఈ నియమాకాలు జరిగాయి.

రొంపిచెర్ల–2గా శ్రీనివాసులు



రొంపిచెర్ల: రొంపిచెర్ల–2 ఎంఈవోగా శ్రీనివాసులను నియమిస్తూ డీఈవో ఆదేశాలు జారీ చేశారు. మండలంలోని పెద్దమల్లెల పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా వారం రోజుల కిందటే ఈయన బాధ్యతలు స్వీకరించారు. పదోన్నతిపై ఆయన రెండవ ఎంఈవోగా నియమితులయ్యారు.

కాబ్బల్లిలో వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

పలమనేరు: మండలంలోని కాబ్బల్లిలో కుప్పం పీఈఎస్ ఆస్పత్రి, లైయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 171 మందికి వివిధ వైద్య పరీక్షలు చేసినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పూసల రవి తెలిపారు. అవసరమైన రోగులకు కుప్పం ఆస్పత్రిలో చికిత్సలు చేయనున్నట్లు ఈపీఎస్ వైద్యులు తెలిపారు. ఆస్పత్రి కమిటీ చైర్మెన్ చెంగారెడ్డి పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంబులెన్స్ ఎక్కాల్సిందే!




మొరం వద్ద రోడ్డు పక్కన ప్రమాదాలను ఆహ్వానిస్తున్న కేబుల్ గుంతలు

పలమనేరు: కుప్పం–పలమనేరు రహదారిలో ఆదమరిచి డ్రైవ్ చేస్తే రోడ్డు పక్కనున్న గుంతలో పడి కాలోచేయో విరుచుకుని వైద్యం కోసం అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. పట్టణ సమీపంలోని క్యాటిల్‌ఫామ్ నుంచి బైరెడ్డిపల్లె వరకు ఓ ప్రైవేట్ నెట్‌వర్క్ కంపెనీ కేబుల్ వైర్లను అమర్చుతోంది. అక్కడక్కడ సైడ్‌బోరు యంత్రాలను వాడుతున్నారు. వీటికోసం గుంతలు తవ్వారు. మరికొన్ని చోట్ల కూలీల ద్వారా గుంతలు తవ్విస్తున్నారు. పనులు ముగిశాక ఈ గుంతలను వెంటనే పూడ్చకుండా అలాగే వదిలేస్తున్నారు. దీంతో నక్కపల్లి, మొరం, డొడ్ల డెయిరీ, గొల్లపల్లె, కొలమాసనపల్లె తదితర గ్రామాల వద్ద రోడ్డుకు ఆనుకొని ఉన్న గుంతలు దగ్గరకు వెళితే తప్ప వాహన చోదకులకు కనిపించవు. ఎదురుగా, వెనుక నుంచే వచ్చే భారీ వాహనాలకు సైడ్ ఇచ్చేందుకు రోడ్డు పక్కకు దిగామంటే గుంతలో పడి బైక్‌లు బోల్తాపడాల్సిందే. ఆటోలు, కార్లు అదుపు తప్పుతున్నాయి. ఇప్పటికే పలు ప్రమాదాలు జరిగి కొందరు గాయాలపాలైయ్యారు. ఇంత జరుగుతున్నా హైవే అధికారులు పట్టించుకోవడం లేదని వాహన చోదకులు ఆరోపిస్తున్నారు.